క్లుప్తంగా

మళ్లీ జగనన్నే సీఎం



సంక్షేమ డిజిటల్ బోర్డును ప్రారంభించిన ఎంపీపీ, తదితరులు

బొండపల్లి: కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు కోరారు. మండలంలోని రాచకిండాం గ్రామంలో మంగళవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గ్రామ సచివాలయం వద్ద సంక్షేమ పథకాల డ్యాష్‌బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి

చీపురుపల్లి రూరల్(గరివిడి): రైతులు ధాన్యం విక్రయించేందుకు ఇబ్బందులు పడకుండా చూడాలని జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు సూచించారు. గరివిడి మండలం దువ్వాం గ్రామంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, రైతులకు మద్దతు ధర చెల్లించి ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. ధాన్యం అమ్మకంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. రైతులు త్వరితగతిన వరి నూర్పులు చేపట్టి ఆర్‌బీకేల్లో ధాన్యం విక్రయించేందుకు షెడ్యూలు చేయించుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి వి.శైలజ, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎం.సురేష్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా దత్తాత్రేయ జయంతి

గజపతినగరం: మండలంలోని పలు ఆలయాల్లో దత్తజయంతి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. పురిటిపెంట-2 ఎంపీటీసీ సభ్యురాలు రేగలత దంపతులు స్థానిక మారుతీనగర్ కాలనీలో దత్తుని విగ్రహానికి భక్తులు క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. మార్గశిర మాసం శుక్లపక్ష పౌర్ణమి తిథిలో దత్తాత్రేయ స్వామి అవతరించినట్లు పురాణాలు చెపుతున్నాయి.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: వైఎస్సార్‌సీపీ విజయనగరం నియోజకవర్గం సోషల్ మీడియా ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆవిష్కరించారు. సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ కనకల కృష్ణ ఆధ్వర్యంలో రూపొందించిన 5000 క్యాలెండర్‌లను మంగళవారం తన నివాసంలో ఆవిష్కరించి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ పార్టీని అభివృద్ధి పథంలో నడిపించటంలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కీలక పాత్ర పోషించాలని, ఇందులో భాగంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించటం ద్వారా పార్టీ నాయకులను, కార్యకర్తలను, ప్రజలను ఉత్తేజరపరచాలన్నారు.

స్వామివారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలందుకుంటున్న జగన్నాథస్వామి

విజయనగరం టౌన్: స్థానిక సంతపేటలో కొలువైన జగన్నాథస్వామి దేవాలయంలో స్వామివారికి వైకుంఠ ఏకాదశి ప్రయుక్త శ్రీ నమ్మాళ్వార్ దివ్య తిరు అధ్యయన మహోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీటీడీ ద్రవిడ వేదపండితులు అనంత వెంకట జగన్నాథచార్యస్వామి ప్రత్యక్ష నిర్వహణలో అత్యంత వైభవంగా పూజాదికాలు చేశారు. స్వామివారికి విశేష దివ్యప్రబంధ సేవాకాలం, తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. జగన్నాథ సేవా సమితి, దేవదాయ శాఖ అధికారులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు



చీపురుపల్లి రూరల్(గరివిడి): 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



కొత్తవలస: కొత్తవలస హైస్కూల్ మైదానంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి 'ఆడుదాం ఆంధ్రా' పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



దత్తిరాజేరు: మరడాం హైస్కూల్ గ్రౌండ్‌లో 'ఆడుదాం ఆంధ్ర' పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి



ఎస్.కోటలో బ్యాటింగ్ చేస్తూ 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహించడం ద్వారా అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా గ్రామ సచివాలయ స్థాయిలో నిర్వహించే క్రీడా పోటీలను మంగళవారం పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రారంభించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు మండల స్థాయి పోటీల్లో పాల్గొంటారు. గరివిడి ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలను ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ప్రారంభించారు. ఎస్.కోట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో, వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన క్రీడా పోటీలను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ప్రారంభించారు. గజపతినగరం మండలం మరుపల్లి ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన క్రీడా పోటీలను ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ప్రారంభించారు.

– సాక్షి నెట్‌వర్క్



మెంటాడ: గజపతినగరం మండలం మరుపల్లి హైస్కూల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



జామి: కుమరాంలో వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సరయు, ఎంపీపీ అరుణ



గుర్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ సీర అప్పలనాయుడు, తదితరులు



గంట్యాడ: రామవరం మైదానంలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ హైమావతి



మెరకముడిదాం: గర్భాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో కీడా పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కొత్తవలస: బలిఘట్టాం సచివాలయం పరిధిలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు పెనగంటి చెల్లియ్య, ఆదిరెడ్డి నాయుడు, తదితరులు



లక్కవరపుకోట: మల్లివీడు సచివాలయం పరిధిలో రిబ్బన్ కట్ చేసి ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ కె.రూపేష్, ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు



బొండపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ చల్లా చల్లంనాయుడు

బాధ్యతలు సక్రమంగా చేపట్టాలి

● ఎమ్మెల్యే అప్పలనరసయ్య



గజపతినగరం: ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యను సన్మానిస్తున్న గేదెల సురేష్, తదితరులు



దత్తిరాజేరు: దత్తి చిరంజీవిని అభినందిస్తున్న ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రాజేశ్వరి, ప్రజాప్రతినిధులు

గజపతినగరం: పార్టీ అధిష్టానం అప్పగించిన బాధ్యతలను సక్రమంగా చేపట్టాలని వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు గేదెల సురేష్‌కు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సూచించారు. యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులైన సురేష్ కాలంరాజుపేట సర్పంచ్ గేదెల ఈశ్వరరావు, ఎంపీటీసీ గేదెల జగదీశ్వరరావుతో కలిసి మంగళవారం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి, సాలువతో సత్కరించారు. పార్టీ పెద్దలు తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని సురేష్ అన్నారు. కార్యక్రమంలో స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, సీనియర్ నాయకులు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, రేగ సురేష్(గోవింద), కె.పైడిపునాయుడు, పి.సంజీవరావు, మండల లక్ష్మునాయుడు, ఇనుమల రాజు, తదితరులు పాల్గొన్నారు.

● దత్తిరాజేరు: వైఎస్సార్‌సీపీలో కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు ఉంటుందని, అందరి సహకారంతో తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని మండల యువజన విభాగం అధ్యక్షుడు దత్తి చిరంజీవి అన్నారు. మరడాంలో ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు, జడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణమూర్తి, తదితరులు ఆయన్ను అభినందించారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సక్రమంగా చేపట్టాలని, వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం పని చేయాలని సూచించారు.

అంగన్‌వాడీల నిరసన

శృంగవరపుకోట: అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె కొనసాగుతోంది. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద మంగళ వారం ఆందోళనలు చేపట్టారు. భోజనం పేట్లపై గరిటెలతో కొడుతూ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు మద్దతిచ్చారు.

ఆర్‌బీకేలు అన్నదాతలకు వరాలు

లక్కవరపుకోట: రైతులకు గ్రామస్థాయిలోనే మెరుగైన సేవలందించాలనే ఉద్దేశంలో రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాలను నిర్మించిందని, ఆర్‌బీకేల సేవలను రైతులు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రంగాపురంలో సుమారు రూ.24 లక్షలతో నూతనంగా నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవసాయం దండగ అంటూ రైతులను నిరుత్సాహ పరిచారని, కానీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి వ్యవసాయానికి పెద్దపీట వేసి సాగును పండగలా మార్చారని అన్నారు. సంక్షేమ పథకాలతో పాటు పలు రాయితీలను రైతులకు అందిస్తున్నారని వివరించారు. విత్తనాలు చల్లిన దగ్గర నుంచి పంట అమ్మకానికి వచ్చే వరకు అన్ని విధాలా రైతులను ప్రోత్సహిస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆవాల శ్యామల, సర్పంచ్ ఆవాల జయలక్ష్మి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ యడ్ల కిశోర్, పార్టీ నాయకులు తూర్పాటి అప్పలరాజు, ఆవాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజల కోసం పరితపించే వ్యక్తి సీఎం జగన్

● ఎమ్మెల్సీ రఘురాజు



కొత్తవలస మండలంలో ఎమ్మెల్సీ రఘురాజు బైక్‌ర్యాలీ

శృంగవరపుకోట, కొత్తవలస: ప్రజలకు మంచి చేయాలని ప్రతిక్షణం పరితపించే జగనన్న మరోసారి ముఖ్యమంత్రి కావాలనే సంకల్పంతో పాదయాత్రగా వెళ్లి తిరుమల శ్రీనివాసుడిని దర్శించుకున్నానని, ఈ పాదయాత్రలో తన వెన్నంటి నడిచిన ప్రతి ఒక్కరికీ, సహకరించిన నాయకులు, పెద్దలందరికీ ఎమ్మెల్సీ రఘురాజు ధన్యవాదాలు తెలియజేశారు. తిరుమల నుంచి మంగళవారం సాయంత్రం బొడ్డవరలోని ఆయన స్వగృహానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో సమావేశమై మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని 43రోజులు, 820 కిలోమీటర్లు పాదయాత్ర చేసి శ్రీవారిని దర్శించుకున్నట్లు చెప్పారు. తన పాదయాత్రలో ఎన్నో జిల్లాలు, ప్రాంతాల ప్రజలను చూశానని, వారితో మాట్లాడానని, అందరి గుండెల్లో జగన్ ఉన్నారని, ప్రజల ఆకాంక్షలే ఆయనకు శ్రీరామరక్షగా ఉంటాయని అన్నారు. రానున్న ఎన్నికల్లో కచ్చితంగా జగనన్న మరోసారి ముఖ్యమంత్రి అవుతారన్నారు. తిరుమల శ్రీనివాసుడిని దర్శించుకుని మంగళవారం తిరిగి వచ్చిన ఎమ్మెల్సీ రఘురాజుకు కొత్తవలస మండలంలోని దేసుపాత్రునిపాలెం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ముందుగా ప్రజాసంకల్పయాత్ర పైలాన్ వద్ద దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ నుంచి సుమారు 300 బైకులపై ర్యాలీగా బొడ్డవర వరకు ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, మండల వైస్ ఎంపీపీ సుధారాజు, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ భవనాల ప్రారంభం

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్ భవనాలను ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య బుధవారం ప్రారంభిస్తారని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం మంగళవారం తెలిపారు. అనంతరం కె.కొత్తవలసలో రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభించి, గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

అంతరపంటలతో అదనపు ఆదాయం

మెంటాడ(గజపతినగరం రూరల్): ప్రధాన పంటతో పాటు అంతరపంటలు సాగుచేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం ఉత్తరాంధ్ర రీజనల్ అధికారి కె.ప్రకాష్ అన్నారు. మండలంలోని పురిటిపెంట గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. స్థానిక రైతు గొర్రెల ఆదినారాయణ వ్యవసాయక్షేత్రాన్ని పరిశీలించారు. క్షేత్రంలోని ప్రధాన పంటతో పాటు పొలం గట్టుపై మామిడి, కొబ్బరి, బొప్పాయి, సపోటా, జామి, మునగ, నిమ్మ వంటి పంటలను పరిశీలించారు. పొలంలోని మొక్కజొన్నతో పాటు అంతరపంటలను సాగుచేస్తుండటంతో రైతును అభినందించారు. అంతర పంటలు సాగుచేయడం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయనతో పాటు మాస్టర్ ట్రైనర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు రైల్వే పెన్షనర్స్ డే

విజయనగరం టౌన్: రైల్వే పెన్షనర్స్ డే వేడుకలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న పింఛనర్లందరూ తరలి రావాలని రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.విశ్వనాథం, ఆర్.ఎస్.కుప్పూరావు కోరారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న రైల్వేస్టేషన్ వద్దనున్న పెన్షనర్స్ కార్యాలయ ఆవరణలో భారీ ఎత్తున వేడుకలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేకంగా చర్చించి, అధికారులకు వినతులిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న రైల్వే పెన్షన్ సభ్యులందరూ హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి సిహెచ్.జగన్నాథరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ వి.ప్రసాదరావు, ఉపాధ్యక్షులు టి.వెంకటరావు, సిహెచ్.అప్పన్న, కేవీ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ప్రభుత్వం



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

● ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: రాష్ట్రంలోని ప్రతీ గడపకు వెళ్లి ప్రజల కష్టాలు తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకే 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున నిధులను ప్రభుత్వం కేటాయిస్తోందని, ఆ నిధులతో గ్రామస్తులకు ఉపయోగపడే పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. శృంగవరపుకోట సచివాలయం–1 పరిధిలో మంగళవారం సాయంత్రం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే శ్రీనివాసరావు గ్రామంలోని ప్రతీ గడపకు వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాల లబ్ధిని వివరించారు. వారి యోగక్షేమాలతో పాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి పంపిన లేఖను వారికి ఇచ్చి దానిపై ఉన్న ఫోన్ నంబరుకు మిస్ కాల్ చేయాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలకు ఇచ్చే పౌష్టికాహారం నుంచి అమ్మ ఒడి, చేయూత, గోరుముద్ద, విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ విద్యాకానుక, ఫీజు రీఇంబర్స్‌మెంట్, రైతుభరోసా, ఆరోగ్యశ్రీ, పింఛన్లు, జగనన్న కాలనీ ఇళ్లు, కులవృత్తుల వారికి ఆర్థికసాయం ఇలా.. అన్ని వర్గాల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. సంక్షేమ పాలన అందించే జగనన్నకు మీ అందరి ఆశీస్సులు కావాలని కోరారు. స్టేట్ ఫోక్ అకాడమీ డైరెక్టర్ వాకాడ రాంబాబు, పార్టీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, రంది అనంత్, చింతల నారాయణమూర్తి, ఆవాల కృష్ణ, మజ్జి శేఖర్, సారిపల్లి గణేష్, ఉల్లి శంకర్, ఎలమంచిలి ఈశ్వరరావు, అప్పలసత్యం, మోపాడ ఈశ్వరరావు, ఎన్.నాగరాజు, స్థానిక నాయకులు, గ్రామపెద్దలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిని త్వరగా గుర్తించాలి : డీఎంహెచ్‌ఓ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ తదితరులు

విజయనగరం ఫోర్ట్: కుష్టు వ్యాధిని త్వరగా గుర్తించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఈ నెల 27వ తేదీ నుంచి వచ్చే ఏడాది 12వ తేదీ వరకు నిర్వహించే ఇంటింటి సర్వేకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుధవారం నుంచి ఆశ కార్యకర్తలు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి చర్మంపై ఏర్పడిన మచ్చలు, ఈ మధ్య కాలంలో వచ్చిన అంగ వైకల్యం ఉన్న వారిని గుర్తిస్తారని తెలిపారు. కుష్టు వ్యాధి నిర్మూలనకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తులను తగిన సమయంలో గుర్తించి వైద్యం అందించడం వలన వ్యాధిని నిర్మూలించవచ్చునని చెప్పారు. గత ఏడాది జిల్లాలో నిర్వహించిన సర్వేలో 112 కేసులు, ఈ ఏడాది చేసిన సర్వేలో 106 కేసులు గుర్తించామన్నారు. 2027 నాటికి కుష్టు వ్యాధి కేసులు లేకుండా చేయాలన్నదనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయ, కుష్టు, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ సేఫ్టీ అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

విజయనగరం క్రైమ్: రోడ్డుపై ప్రయాణం చేసేటప్పుడు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించి ప్రయాణం చేయాలని రోడ్ సేఫ్టీ ఎన్‌జీఓ అధ్యక్షుడు మజ్జి అప్పారావు పేర్కొన్నారు. స్థానిక రింగురోడ్డులో ఉన్న ప్రైవేటు ఆస్పత్రిలో మంగళవారం రోడ్ సేఫ్టీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగేటప్పుడు తోటి ప్రయాణికులకు సహాయం చేయాలని, అందుబాటులో ఉన్నటువంటి ఆటోలు, 108 వాహనాలు రప్పించి దగ్గరగా ఉన్న ఆస్పత్రులకు తీసుకువెళ్లి వైద్యం చేయించాలన్నారు. ఆ ప్రాంత పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేసి ప్రమాద వివరాలు తెలియజేసి, ప్రాణాలు కాపాడాలన్నారు. అలా చేసిన వారికి కలెక్టర్ చేతుల మీదుగా గుడ్ సమరిటన్ పథకం ద్వారా రూ.5వేలు నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేస్తామన్నారు. డాక్టర్ మహేంద్ర, ఎన్‌జీఓ ప్రతినిధులు శ్రీహరిబాబు పాల్గొన్నారు.